క్లుప్తంగా

కమ్యూనిస్టులే ప్రజల గొంతుకలు

చిట్యాల: కమ్యూనిస్టు పార్టీ నాయకులే ప్రజల గొంతుకలై నిరంతర పోరాటాలు చేస్తారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండలంలోని వట్టిమర్తి, వనిపాకల గ్రామాల్లో సోమవారం జరిగిన సీపీఎం గ్రామశాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీను, రాచకొండ శ్యాంసుందర్, గుడిసె లక్ష్మీనారాయణ, మేడి పాపయ్య, గుణగంటి కృష్ణయ్య, బూరుగు శ్రీను, కొంపల్లి రమేష్, సిరిపంగి యాదయ్య, నర్రా భిక్షంరెడ్డి, మిర్యాల నరేందర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


పావని

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన కురుపాటి పావని అనే వివాహిత తన కుమార్తైతో ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయింది. ఆమె తండ్రి కడతాల యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునుగోడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పావనికి తన భర్త జనార్దన్‌తో కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన ఇరువురి మధ్య గొడవ జరగడంతో తన కుమార్తై మంజుని వెంట తీసుకుని గ్రామం నుంచి వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు నాలుగు రోజులుగా తమ బంధువులు, చుట్టు పక్కల గ్రామాలు వెతికినా కనిపించలేదు. ఆమె తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పావని ఆచూకీ తెలిసినవారు 8712670183 సెల్ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

సాహస శిక్షణలో చండూరు విద్యార్థి

చండూరు: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో అటల్ బిహారీ వాజ్‌పేయి పర్వతారోహక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహస శిక్షణ శిబిరానికి చండూరు పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థి బి.శంకర్ ఎంపికయ్యాడు. ప్రతి ఏటా పలువురు విద్యార్థులను ఎంపిక చేసి ఆ సంస్థ పర్వతారోహక, రోప్‌కార్న్, రోప్ బైండింగ్, రాక్ క్లైంబింగ్‌పై శిక్షణ ఇస్తుంటారు. 2024 సంవత్సరానికి చండూరు డిగ్రీ కళాశాల విద్యార్థి శంకర్ ఎంపికై శిక్షణ పొందుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్ తెలిపారు.

నేడు టీజేఎస్ సమావేశం

మర్రిగూడ : మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం టీజేఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతామన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్ల యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావుయాదవ్, కట్ల జగన్నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోడ సునిల్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న బోడ సునిల్

శాలిగౌరారం: మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునిల్ సోమవారం హైదరాబాద్‌లో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జాతీయ స్థాయి స్ఫూర్తి అవార్డు అందుకున్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ 149వ జయంతి ఉత్సవాల సందర్భంగా దైద వెంకన్న, అనిత నిర్వాహణలో హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల కళా సంగీత నాట్య వేదిక ఆడిటోరియంలో జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడు, రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరం, వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి వారసురాలు డాక్టర్ శాంతాబాయి, గుర్రం జాషువా వారసురాలు అమృతపూడి రేవతిలు ఈ అవార్డును సునిల్‌కు అందజేసి శాలువాతో సన్మానించారు. సామాజిక ఉద్యమాలు, సమాజ సేవ, దళిత బహుజన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేసినందుకు తనకు ఈ అవార్డు దక్కినట్లు సునిల్ తెలిపారు.

'అంబేద్కర్ అభయహస్తం' ప్రారంభించాలి

నకిరేకల్ : అంబేద్కర్ అభయహస్తం(దళిత బంధు) పథకాన్ని వెంటనే ప్రారంభించాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాతాకుల శేఖర్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన వివిధ పార్టీల, సంఘాల నాయకులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాన్షీరాం, యాతాకుల ఈశ్వర్, రమేష్, కారింగుల యాదగిరి, మంద పద్మ, పోలెపల్లి నాగమణి, నకిరేకంటి వెంకన్న, పందిరి సురేష్, యడవెల్లి సరళ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న కూలీల కొరత

- ఏటా స్థానికంగా తగ్గుతున్న కూలీల సంఖ్య
- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- పెరుగుతున్న అదనపు ఖర్చులు


ఇతర ప్రాంతాల నుంచి ఆటోలో వస్తున్న కూలీలు

మునుగోడు: కొండంత ఆశతో పంటలు సాగు చేస్తున్న రైతులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. దుక్కి దున్ని, విత్తనాలు నాటి, అవి మొలిచి పంట దిగుబడి వచ్చేవరకు చేసిన శ్రమ ఒక ఎత్తయితే.. పంట దిగుబడి చేతికి రావడం మరో ఎత్తుగా మారింది. అందరు రైతులకు కూలీల అవసరం ఒకేసారి ఉండడంతో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

ఆంధ్ర రాష్ట్రం నుంచి కూలీలను తీసుకొచ్చి..

మునుగోడు మండలంలోని 27 గ్రామాల్లో దాదాపు 20వేల మంది రైతులు తమకున్న భూముల్లో అధికంగా పత్తి పంట సాగు చేశారు. మండల వ్యాప్తంగా 54 వేల ఎకరాల సాగు భూమి ఉండగా.. అందులో పత్తి పంట దాదాపు 38 వేల ఎకరాల్లో సాగుచేశారు. అయితే ఆ చేలన్నీ ఒకేసారి దిగుబడి రావడంతో పత్తిని తీసేందుకు అవసరమైన కూలీలు స్థానికంగా దొరకడం లేదు. అంతేకాకుండా ఏటా గ్రామాల్లో కూలీల సంఖ్య భారీగా తగ్గిపోతోంది. దీంతో కూలీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు పక్క జిల్లా అయిన మహబూబ్‌నగర్ నుంచి వలస కూలీలను తీసుకొచ్చి వారు ఉండేందుకు నివాసం ఏర్పాటుచేసి స్థానిక రైతులు పత్తి తీయించుకుంటున్నారు. దీంతో కూలీ డబ్బుల తోపాటు వలస కూలీలకు వసతులు కల్పించేందుకు అదనంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది.

చుట్టుపక్కల మండలాల నుంచి..

మునుగోడు మండలంలోని చిన్న సన్నకారు రైతులు నల్లగొండ, నార్కట్‌పల్లి, నకరేకల్ తదితర గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఆటోల్లో రోజువారీగా కూలీలను తీసుకొచ్చి పత్తిని ఏరించుకుంటున్నారు. అందుకు కూలీ డబ్బులతోపాటు ఆటో చార్జీలు అదనంగా భరించాల్సి వస్తోంది. దీంతో తమ చేలో వచ్చిన దిగుబడిలో సగం డబ్బులు కూలీలకే చెల్లించాల్సి వస్తోంది. మిగిలిన డబ్బులు పెట్టుబడి ఖర్చులు పోను కనీసం తమ కష్టానికి కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా కూలీల కొరత అధికమవుతోందని, కూలీలతో ఇబ్బందులు పడేకంటే వ్యవసాయం మానుకోవడం మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రా నుంచి కూలీలను తీసుకొచ్చాం



ఈ ఏడాది వర్షాలు అడపాదడపా కురవడంతో దిగుబడి అంతంతమాత్రంగా వచ్చింది. పత్తి ఏరేందుకు స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూలీలను తీసుకొచ్చి వారు ఉండేందుకు నివాసం ఏర్పాటు చేశాం. అంతేకాకుండా ఇతర సౌకర్యాలు కూడా నలుగురైదుగురు రైతులం కలిసి ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాం. దీంతో భారం అధికమవుతోంది. – అంజయ్య, రైతు, ఎల్లగూడెం

నెల రోజులుగా ఉపాధి పొందుతున్నాం



నెల రోజుల క్రితం మేము పత్తి కూలీ పనికోసం కుటుంబ సభ్యులతో కలిసి మునుగోడు మండలానికి వచ్చాం. మేము ఉండేందుకు వసతి సౌకర్యంతోపాటు ఇతర సౌకర్యాలను కూడా రైతులే కల్పిస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తే మాకు రోజుకు రూ.1200 వరకు వస్తోంది. ఇలా రెండు నెలల వరకు మాకు చేతినిండా పని దొరుకుతుంది. – యహోవా, వసల కూలీ, శ్రీకాకుళం జిల్లా

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అబద్దపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం, కాలేజీ అమ్మాయిలకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500, పింఛన్ల పెంపు అమలు చేయకుండా ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరుతో డబ్బులు దండుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులందరికి రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, రావెళ్ల కాశమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

చిట్యాల: ఉద్యోగులకు పీఆర్‌సీతోపాటు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు చెల్లించాలని కోరుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో సోమవారం చిట్యాల డిప్యూటీ తహసీల్దార్ విజయకు యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు బి.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మర్రిగూడ : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీపీయూఎస్ రాష్ట్ర బాధ్యుడు పి.రవీందర్‌రావు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎం.రమణ, ప్రధాన కార్యదర్శి బి.శ్రీశైలం, బి.శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవతామూర్తుల కల్యాణం



నకిరేకల్‌లోని శ్రీ సత్యసాయి మందిర ఆవరణలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నకిరేకల్ : లోక కల్యాణార్థం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిర ఆవరణలో మూడు రోజులపాటు నిర్వహించిన దేవతామూర్తుల కల్యాణం వేడుకలు సోమవారం ముగిశాయి. తొలిరోజు శనివారం శ్రీసీతారాముల కల్యాణం, రెండోరోజు ఆదివారం హనుమాన్ కల్యాణం నిర్వహించారు. చివరి సోమవారం శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముగింపు వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణం తిలకించారు. మూడు రోజులపాటు జరిగిన దేవతామూర్తుల కల్యాణ వేడుకలను జరిపించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం, రాజమండ్రి, గుంటూరు ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులను సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. హాజరైన వారందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. శ్రీ సత్యసాయి మందిర అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావ్, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాసులు, మిట్టపల్లి యాదగిరి, బ్రహ్మదేవర పద్మావతి, ఎస్.రాంమోహన్‌రావు, గాంధీ, దేవరశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి


సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్ఓ

కనగల్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం కనగల్ ఐకేపీ సెంటర్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ కాంటా వేసిన ధాన్యం బస్తాలు కేంద్రంలో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు గోదాముకు తరలించాలన్నారు. అనంతరం కనగల్ వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు గోదాములను పరిశీలించారు. ధాన్యం స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ వివరాలను నమోదు చేయాలని గోదాం ఇన్‌చార్జ్‌ను ఆదేశించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

నాంపల్లి : సన్నధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని జిల్లా పౌర సరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. సోమవారం నాంపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తూకం అయిన ధాన్యం బస్తాలను వెంటనే ఎగుమతి చేయాలన్నారు. ఆయన వెంట హరీష్,సైదులు తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నార్కట్‌పల్లి: మండలంలోని మాధవ యడవల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవ యడవల్లి గ్రామానికి చెందిన కొప్పు జానయ్య తన కుటుంబ సభ్యులతో కలసి సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి 11గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో నాలుగు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కలెక్టర్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ మంజూరు చేయాలని కోరుతూ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ కౌన్సిల్ మెంబర్ షేక్ చాంద్‌పాషా సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట ఎండీ.షాహిన్ తయ్యబ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంఏ.గఫూర్, ఎండీ.ముబీన్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్, ఎస్ఐపై ఫిర్యాదు

నల్లగొండ టౌన్: మునుగోడు మండల కేంద్రంలో వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నప్పటికీ స్థానిక తహసీల్దార్, ఎస్ఐ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తూ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పార్ వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లకు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై ఇసుక అక్రమంగా తరలిస్తున్నా తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మునుగోడు మండలంలో ఇసుక అక్రమ రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బండమీది యాదయ్య, తిరందాసు శ్రీనివాస్, శేఖర్‌లు తదితరులు ఉన్నారు.


అనారోగ్యంతో యువకుడు మృతి

కనగల్ : మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బిచ్చాల నాగరాజు (36) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులు గౌడ్ సోమవారం నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పగిళ్ల యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ బిచ్చాల సైదమ్మ, శ్రీను, ఏ జనార్దన్, సీహెచ్ విజయ్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

మర్రిగూడ : కుమారస్వామి ఫిల్లింగ్ స్టేషన్ రెండో వార్షికోత్సవం సందర్భంగా మర్రిగూడ మండలంలోని శివన్నగూడలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎస్ఐ కె.రంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. శివన్నగూడతోపాటు పరిసర గ్రామాల నుంచి సుమారు 200 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు తులసీరామ్, హరీష్, సంధ్య, సిబ్బంది ఉన్నారు.

నల్లగొండ ఆర్డీఓగా అశోక్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



నల్లగొండ : రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా హైదరాబాద్ హెచ్‌ఎండీఏలో పనిచేస్తున్న అశోక్ రెడ్డిని నల్లగొండ ఆర్డీఓగా బదిలీ చేశారు. సోమవారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పరీక్షఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నల్లగొండ : ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం నల్లగొండలోని డీఐఈఓ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా ధర్నా చేపటాత్టరు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా.. ఇప్పుడు పరీక్ష ఫీజులను వంద శాతం పెంచాలని ఆలోచన చేయడం సరికాదన్నారు. ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కమ్మంపాటి శంకర్, సహాయ కార్యదర్శులు ముసుగు రవీందర్, విద్యార్థులు నవదీప్, కిరణ్, సాయి, అంజి, విఘ్నేష్, కళ్యాణ్, వర్షిత్, జగదీష్, మల్లేష్ , రాము, కోటేష్‌నాయక్, మహేష్, క్రాంతి, సంపత్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి


వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

తిప్పర్తి : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డికి మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు భీమగాని గణేశ్ మాట్లాడుతూ కార్మికులకు నాలుగు నుంచి ఎనిమిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మన్నెం భిక్షం, కంచర్ల జానయ్య, సైదులు, యాదయ్య, పాలడుగు చంద్రయ్య, రాములు, శివ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లోగా పనులు పూర్తి

- మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను మున్సిపల్ ఎన్నికల లోపు పూర్తి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నీలగిరి మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో తొందరపడితే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో 186 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే పట్టణంలో 90 శాతం మేర సీసీ రోడ్లే ఉంటాయన్నారు. మిగిలిపోయిన కొన్ని కాలనీల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీలగిరి పట్టణానికి ప్రభుత్వం నుంచి అధిక నిధులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. నల్లా బకాయిల విషయంలో కౌన్సిలర్లు మున్సిపాలిటీకి సహకరించాలన్నారు. కొత్తగా తాగు నీటి ట్యాంకుల నిర్మాణం జరుగుతున్నందున విద్యుత్ బిల్లులు పెరుగుతాయని, వాటికి అనుగుణంగా నల్లాల బిల్లులు వసూలు చేయించాలన్నారు. అలకాపురి కాలనీ వెనుక ఉన్న శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు పున్న గణేశ్, గోగుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ శ్మశానవాటిక అభివృద్ధి కోసం రూ.2.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ పలు కాలనీల్లో యూజీడీ మ్యాన్ హోల్స్ పగిలిపోయాయని, వాటి స్థానంలో కొత్తవి అమర్చాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్‌ముసాబ్ అహ్మద్, వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఈఈ రాములు, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, వివిధ పార్టీల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి స్కాలర్ షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రూ. 7500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఉన్నత చదువులు చదుకునే పేద విద్యార్థులకు ఫీజు బకాయిలు శాపంగా మారాయన్నారు. ఫీజులు చెల్లించాలని కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయని, వెంటనే ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి గట్టిగొర్ల శివరామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సింధు, మౌనేశ్వర్‌చారి, చందు, శివ, విగ్నేష్, శివాజీ, హరి, క్రాంతి, వేణు, శివమణి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

డీజిల్ ట్యాంకర్, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

మర్రిగూడ : డీజిల్ ట్యాంకర్, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని తానేదారుపల్లికి చెందిన పాగాకు బాలరాజు వ్యక్తిగత పనులు ముగించుకుని మర్రిగూడ నుంచి తన అక్కతో కలిసి గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో చండూరు నుంచి వస్తున్న డీజిల్ ట్యాంకర్..బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బాలరాజుకు తీవ్ర గాయాలు కాగా తన అక్కకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

3న మహా సమ్మేళనం

చిట్యాల: ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీన నిర్వహించనున్న కార్యకర్తల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పార్టీ చిట్యాల మండల కన్వీనర్ మేడి రాజేష్‌కుమార్ కోరారు. చిట్యాలలో మహా సమ్మేళనం ప్రచార కరపత్రాలను సోమవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. పార్టీ కో కన్వీనర్ రాకేష్, నరేష్, ప్రేమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

చిట్యాల: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను చిట్యాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిట్యాల ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాటం వెంకటేశం కేక్ కట్ చేశారు. కౌన్సిలర్ కోనేటి కృష్ణ, ఏర్పుల పరమేష్, కోసనం అశోక్, జిట్ట భిక్షం, సల్లా రాజు, మదన్ పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన గంగాధర్‌రావు

నకిరేకల్ : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయనను నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన బీజీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలో టీజీటీ సైన్స్, ఫిజిక్స్ సైన్స్‌లో పార్ట్‌టైంగా ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాసులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 55శాతం, బీఈడీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి టెట్ అర్హత కలిగి ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 సాయంత్రంలోపు పాఠశాలలో అర్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.